www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 ఆగస్టు 2025
5
తిరుపతి



యంబియులో కంటైనర్ స్టేడియం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మోహన్ బాబు విశ్వవిద్యాలయం (ఎంబియు) తిరుపతి క్యాంపస్‌లో భారతదేశపు మొట్టమొదటి కంటైనర్ స్టేడియంను ఆవిష్కరించారు. నాలుగు సంవత్సరాలుగా, రూ.30 కోట్ల పెట్టుబడితో సాంప్రదాయ సిమెంట్-ఉక్కు నిర్మాణానికి బదులుగా అప్‌సైకిల్డ్ షిప్పింగ్ కంటైనర్లను ఉపయోగించడంతో, 1500 టన్నుల కర్బన ఉద్గారాలను నివారించారు. ఈ సందర్భంగా యంబియు ప్రో-ఛాన్సలర్ విష్ణు మంచు మాట్లాడుతూ విదేశాలలో కంటైనర్ స్టేడియంలను చూసి, అలాంటిదే నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తిరుపతిలో 100 ఎకరాలలో విస్తరించి ఉన్న మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ఈ కంటెయినర్ స్టేడియంలో అథ్లెటిక్ ఈవెంట్‌లు, సాంస్కృతిక ఉత్సవాలు, అకడమిక్ వేడుకలు, పెద్ద బహిరంగ సభలకు ఒక ఆదర్శవంతమైన వేదికగా ఉంటుందన్నారు.

శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించండి

- నేడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం
- కార్పొరేషన్ నుంచి తుడాకు బదిలీ 15 నెలలుగా జాప్యం
- విసిగిపోతున్న బాధితులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆరు తరాల ప్రజలు శెట్టిపల్లి భూముల విషయంలో ప్రభుత్వాల మాటలతో విసిగిపోయారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఎన్నికల్లో చెప్పేది ఒకటి చేసేది ఒకటి. అసలు శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించాలనే శ్రద్ధ ప్రభుత్వాలలో కనబడడం లేదు. కేవలం వ్యాపార పరంగానే ఈ సమస్యను చూస్తున్నారు. రైతులు, సామాన్య, మధ్యతరగతి ప్రజల గోడు పట్టించుకోవడం లేదు. ఉత్తుత్తి హామీలు, సమీక్షలు, పరిశీలన మాత్రమే చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. పైసా, పైసా కూడబెట్టి భూములు కోనుగోలు చేసిన సామాన్య, మధ్య తరగతి ప్రజలు డీలా పడిపోయారు. సమస్య పరిష్కారానికి సంవత్సరాల తరబడి ఇటు ప్రభుత్వం, అటు ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న ఉపయోగం లేదని శెట్టిపల్లి భూముల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న భూమిలో ఇటు వ్యవసాయం చేసుకోలేక, అటు అవసరాల కోసం అమ్ముకోలేక తరతరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. సిపిఎం పోరాట ఫలితంగా శెట్టిపల్లి భూముల పరిష్కారంలో అధికారుల్లో, ప్రజా ప్రతినిధుల్లో కదలికలు వచ్చాయి. గత వైసిపి ప్రభుత్వం శెట్టిపల్లి భూములు తుడా నుంచి కార్పొరేషన్‌కు బదలాయించింది. 100 ఎకరాల భూమి కార్పొరేషన్ పరిధిలోకి వచ్చింది. ప్లాట్లు ఉన్న వారికి ప్రొసిడింగ్ పత్రాలు ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత వాటి పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం కూడా శెట్టిపల్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా మళ్లీ సమస్య పెండింగ్ లోనే పడింది. ఆర్థిక వనరులు లేక తిరుపతి కార్పొరేషన్ తాము నిర్వహణ చేయలేమని చేతులెత్తేసింది. తాజాగా తుడకు బదలాయించి ఆ భూములు లేఅవుట్లు వేసి వాటి ద్వారా వచ్చిన నిధులను ఆ భూముల అభివృద్ధి చేయాలని కార్పొరేషన్ కమిషనర్, విసి మౌర్య, కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రతిపాదించారు. కలెక్టర్ ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ ప్రతిపాదన క్యాబినెట్లో పెట్టి ఆమోదం తెలుపుతారు. శెట్టిపల్లి భూముల సమస్యను కార్పొరేషన్ నుంచి తుడాకు బదలాయించడం పట్ల శెట్టిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 76 ఏళ్లుగా ఉన్న సమస్య, దశాబ్దాల కాలంగా రైతులకు ఎలాంటి హక్కులు లేకుండా ఉన్న భూములకు సర్వహక్కులు ఇప్పటివరకు వారికి రాలేదు. ఈ భూము వ్యవహారం ఓ కొలిక్కి వస్తే రైతులకు రూ.2 వేల కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది.



తుడ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, శెట్టిపల్లి భూముల బాధితులు (దాచిన చిత్రం)

క్యాబినెట్లో నిర్ణయం తీసుకోండి
: శెట్టిపల్లి ఇళ్ల సాధన కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం బుధవారం జరగనుంది. ఈ భూముల వ్యవహారం క్యాబినెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని శెట్టిపల్లి ఇళ్ల సాధన కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భూములను రైతుల వద్ద నుండి తీసుకోవడం జరిగింది. రైతులు వద్ద ఉన్న వ్యవసాయ భూమిని 30 శాతం వారి కేటాయించి, 70 శాతం తీసుకునేలా నిర్ణయం చేశారు. లేఔట్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి 50:50 నిష్పత్తి ప్రకారం తీసుకోవడం జరిగింది.

1978లో కొనుగోలు చేశారు

శెట్టిపల్లిలో1978లో ప్రభాకర్ నాయుడు తమ కుటుంబ సభ్యుల పేరుతో ఎనిమిది ఎకరాల భూమి కొనుగోలు చేయడం జరిగింది. కుటుంబ సభ్యులు 2012లో భాగ పరిష్కారం చేసుకోవడం జరిగింది. అంతలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములు రిజిస్ట్రేషన్ జరగకుండా బ్యాన్ విధించింది. ఇప్పటికైనా రాష్ట్ర క్యాబినెట్లో మున్సిపల్ కార్పొరేషన్‌కు బదలాయించి, త్వరగా బాధితులకు న్యాయం చేయాలని, లేదంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని బాధితులు హెచ్చరించారు.



బాధితుల నిరసన (దాచిన చిత్రం)

ల్యాండ్ పులింగ్ చేశారు..
ప్లాట్లు ఇవ్వలేదు - హేమలత

శెట్టిపల్లి భూములను రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పులింగ్ పేరుతో తీసుకోవడం జరిగిందని. 14 సంవత్సరాల క్రితం తాము నాలుగు సెంట్లు చొప్పున భూమి కొనుగోలు చేశామన్నారు. ఇంతవరకు ప్లాట్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాలో కేవలం ప్రొసీడింగ్స్ మాత్రమే ఇచ్చారు, దాని తర్వాత ముందుకు కదల్లేదు. నాలుగు సెంట్లు భూమి ఉన్నప్పటికీ తమ పిల్లల చదువుకి భూమి ఏ మాత్రం ఉపయోగపడలేదన్నారు. పిల్లలు పెళ్లిళ్ల చేయాలన్న ప్లాట్లు అమ్ముకోలేని పరిస్థితిలో ఉన్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వాలే అడ్డు పుల్లలుగా మారాయి - రవీంద్ర

శెట్టిపల్లి ప్లాట్ల యాజమానులకు న్యాయం చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. పేరుకేస్తా ప్లాట్లు ఉన్నాయి తప్ప అమ్ముకోలేని స్థితిలో ఉన్నామన్నాం. ఏ కష్టం వచ్చినా భూములు ఉన్నాయనే భరోసా కరువయింది.

ప్రభుత్వం తీరు పట్ల నష్టపోయాం - చూడామణి

ప్లాట్లు ఉన్నవారు కష్టం వచ్చినప్పుడు వాటిని అమ్ముకోలేక అప్పులు చేసి, ఉన్న ప్లాటు కూడా పోగొట్టుకునే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తుడకు ఒక జీవో ఇవ్వడానికి 15 నెలలు సమయం తీసుకోవడం పేద ప్రజల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యమే. అధికారంలో వచ్చిన వెంటనే శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటివరకు అతిగతి లేకుండా చేయడం తగదన్నారు.

తుడాకు అప్పగిస్తే అభివృద్ధి

శెట్టిపల్లి భూములు గతంలో తుడా పరిధిలోనే ఉండేవి. అయితే వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అప్పటి చంద్రగిరి, తిరుపతి ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో శెట్టిపల్లి భూములు కార్పొరేషన్‌లో బలవంతంగా విలీనం చేయించారు. అయితే కార్పొరేషన్ 100 ఎకరాలు తీసుకోవడం జరిగింది కానీ అభివృద్ధి చేయాలంటే కోట్లాది రూపాయలు కావాల్సి ఉంది. అంత నిధులు లేకపోవడంతో మళ్లీ తుడాకు అప్పగించాలని నిర్ణయానికి వచ్చారు. తుడాలో విలీనం చేస్తే తుడా కొంత భూమిని తీసుకుని వాటిని అభివృద్ధి చేసి దాని ద్వారా వచ్చిన నిధులను శెట్టిపల్లి భూముల అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. ఉదాహరణకి 100 ఎకరాలు అభివృద్ధి చేయాలంటే తుడాకు 100 కోట్లు ఖర్చు అవుతుంది. తుడా వద్ద అంత నిధులు లేవు. లేఅవుట్లు వేసి వచ్చిన నిధుల్లో అభివృద్ధికి ఖర్చు చేస్తామని తుడా విసి మౌర్య తెలిపారు. తుడా చైర్మన్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి శెట్టిపల్లి భూములను పరిశీలించారు. మంత్రి నారాయణ శెట్టిపల్లి భూములపై సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి విఫలం

- 11న విద్యుత్ కార్యాలయాల ముట్టడి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గత ప్రభుత్వ పాలన కన్నా మించిన పాలనను రాష్ట్ర ప్రజలకు అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల విలీన ప్రక్రియపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లావ్యాప్తంగా 44 పాఠశాలలకు విలీనం నుంచి విముక్తి కల్పిస్తామంటూ కలెక్టర్ చెప్తున్నా ఆచరణ మరో విధంగా ఉందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా ప్రజలపై విద్యుత్ భారాలు మోపనంటూనే రూ.12.77 వేల కోట్ల వడ్డనకు దిగారంటూ కూటమి ప్రభుత్వ పాలన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 11వ తేదీన రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయని తెలిపారు. విద్యుత్ కార్యాల వద్ద జరిగే నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తిరుపతి శెట్టిపల్లి భూ సమస్యను క్యాబినెట్లో చర్చించి తుడాకు అప్పగించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోర్టబులిటీ పేరిట 65 వేల రేషన్ కార్డులకు చౌక బియ్యం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల వ్యవస్థ పైన కూటమికున్న సవతి ప్రేమే ఇందుకు కారణమన్నారు. జిల్లా వ్యాప్తంగా ముగ్గురంటే ముగ్గురే సివిల్ సప్లై డీటీలు ఉన్నారంటే ఆ వ్యవస్థ పైన చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని దుయ్యబట్టారు. జిల్లాలోని మామిడి రైతులకు కిలో రూ. 8 చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సంక్షేమ హాస్టళ్ళలో మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. టూరిజం కారిడార్ పేరిట కోస్తా తీర ప్రాంతాన్ని కార్పొరేట్స్ చేతుల్లో పెట్టకుండా కాపాడాలని కోరారు. టూరిజం అభివృద్ధిని ఆ శాఖే చేపట్టాలని సూచించారు. కోస్తా ప్రాంతాలను కార్పొరేట్లకు అప్పజెబితే మత్స్యకారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుందనీ, ప్రభుత్వం భూసేకరణ కార్యక్రమాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటీ.. ప్రవచనాలకు చోటేది..?

- మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రమైన దక్షిణ కైలాసంలో ఆధ్యాత్మిక ప్రవచనాలకు, ధార్మిక ప్రసంగాలకు శ్రీకాళహస్తి దేవస్థానం అనుమతులు ఇవ్వకపోవడం అత్యంత శోచనీయమని దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం విమర్శించారు. పురాణాల, ఇతిహాసాల శ్రవణం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకొచ్చేందుకు శుక బ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం శుకబ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో చాతుర్మాస వ్రత ప్రవచనాలకు స్థానిక ముత్యాలమ్మ గుడి కళ్యాణ మండపంలో అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. గతంలో వరదరాజుల స్వామి ఆలయ ప్రాంగణంలో గీతా మహా యజ్ఞం, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగేవనీ, దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహించే వారిని గుర్తు చేశారు. వరదరాజుల స్వామి ఆలయ నిర్మాణం దృష్ట్యా గతంలో తాము దేవస్థానం చైర్మన్‌గా ప్రవచనాలకు ముత్యాలమ్మ గుడి కళ్యాణ మండపంలో అనుమతించామని తెలిపారు. శ్రీ కాళహస్తి ఆలయ ఈవో బాపిరెడ్డికి కింద స్థాయి అధికారులు ఎలాంటి సమాచారమిచ్చారో సరిచూసుకొని గతంలో తమ ట్రస్ట్ బోర్డు దేవస్థానం ఆధ్వర్యంలోనే ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగేలా సహకారం అందించాలని చేసిన తీర్మానాన్ని గుర్తించి, ప్రవచనాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు.


షార్ డైరెక్టర్ పద్మకుమార్‌కు స్వాగతం.. రాజరాజన్‌కు వీడ్కోలు



ప్రజాశక్తి - సూళ్లూరుపేట: మాజీ షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు వీడ్కోలు, నూతన డైరెక్టర్ పద్మకుమార్‌కు స్వాగతం. మంగళవారం సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో నూతన డైరెక్టర్ ఇ.ఎస్. పద్మకుమార్‌కి స్వాగతం, మాజీ డైరెక్టర్ ఎ.రాజరాజన్‌కి వీడ్కోలు సభను ఏర్పాటు చేసారు. ఎ. రాజరాజన్ 2019 జులైలో షార్ డైరెక్టర్‌గా భాధ్యతలు చేపట్టిన విషయం విధితమే. ఇటివల రాజరాజన్‌కి వీ.ఎస్.ఎస్.సీ,డైరెక్టర్‌గా భాధ్యతలు ఇస్తూ ఇస్రో యాజమాన్యం ఉత్తర్వులు జారిచేసింది. ఈ సందర్భంగా షార్ యాజమాన్యం ఎ.రాజరాజన్ కి ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో నూతన షార్ డైరెక్టర్ ఇ.ఎస్. పద్మకుమార్, ఎస్.ముత్తుచెలియన్ అసోసియేట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, కంట్రోలర్ షార్, డిప్యుటి డైరెక్టర్లు, షార్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

350వ రోజుకు శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షలు

- టీటీడీ యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలి : కందారపు మురళి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు మంగళవారం 350వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లి ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ 350 రోజులుగా సామాన్యులు తమ సమస్యలు పరిష్కరించమని దీక్షలు చేస్తున్నా టిటిడి యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. పలు దఫాలుగా ప్రజాప్రతిని ధులను, అధికారులను కలిసి తమ సమస్యలను చెప్పుకుంటున్నా న్యాయం జరగకపోవడం ఆధ్యాత్మిక క్షేత్రంలో ధర్మమేనా అని ప్రశ్నించారు. మరో 15 రోజులు గడిస్తే ఏడాది పూర్తవుతుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. దీక్షలు చేస్తున్న పేదల పట్ల కనీసం స్పందించకపోవడం ఏ రకమైన న్యాయమో పాలకులు చెప్పాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు తిరుపతికి పలుమార్లు వచ్చినా, ప్రతి రోజూ అధికార యంత్రాంగం జరుగుతున్న పోరాటం గురించి ప్రభుత్వానికి నివేదనలు చేస్తున్నా, కనీసం స్పందించి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయకపోవడాన్ని ఆయన తప్పు పట్టారు. రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య మాట్లాడుతూ శ్రీవారి మెట్టు వ్యాపారులకు మద్దతు తెలిపారు. 350 రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే సామాన్యుల పట్ల వ్యవహరించే తీరు ఇదేనా అని అసహనం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సిఐటియు నేత జయచంద్ర, యూనియన్ అధ్యక్షులు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మధు, పలువురు చిరు వ్యాపారులు సమస్యను పరిష్కరించమని టిటిడి యజమాన్యానికి, పాలకమండలికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు ప్రకాష్, రామ్మూర్తి, చిరంజీవి, రాంబాబు, శేఖర్, సోను, రాజు, గోవిందయ్య, ముని, గోపి, ఉమామహేశ్వరి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు..

ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు

- అమెరికా నుంచి సొంత ఊరు తిరుపతికి వస్తుండగా విషాదం..
- రెక్కలు కట్టుకు వందల మైళ్లు దాటుకుని వచ్చి.. మృత్యువాత

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): మంగళవారం తెల్లవారుఝామున పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయాలపాలయ్యారు. చంద్రగిరి పోలీసుల కథనం మేరకు తిరుపతి కరకంబాడి రోడ్డు, కెఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ కుమారుడు కార్తీక్, కోడలు లామలు అమెరికాలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవించే వారు. అమెరికా నుండి తిరుపతికి వచ్చేందుకు విమానంలో బెంగళూరుకు సోమవారం రాత్రి చేరుకున్నారు. బెంగళూరు నుండి తిరుపతికి కారులో వస్తుండగా, చంద్రగిరి మండలం, ఐతేపల్లి సమీపం, పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై క్యాండోర్ స్కూల్ సమీపంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనింది. ఈ ప్రమాదంలో డ్రైవరు రాజేష్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. లామ, కార్తీక్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ లామ(34) మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కార్తీక్ చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పంచనామా చేసి వారి వారి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన లామ



గాయాల పాలైన కార్తీక్



మృతి చెందిన డ్రైవర్ రాజేష్

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



- కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం కచ్చపి ఆడిటోరియం మహిళా సంఘాలలోని స్టార్ పెర్ఫార్మర్ మహిళలకు లీప్ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక కుటుంబం - ఒక వ్యాపారస్థుడు అనే నినాదంతో ప్రతి మహిళా సంఘంలో ఒకరిని వ్యాపారస్థుడిని చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పని చేస్తున్నారు. అందులో భాగంగానే మెప్మా ఎస్.ఎం.ఈ ఫోరంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలలో అత్యున్నత ప్రమాణాలతో వ్యాపారం చేస్తున్న వారిని స్టార్ పెర్ఫార్మర్స్‌గా గుర్తించడం జరిగిందన్నారు. వీరి వ్యాపారం మరింత మెరుగ్గా చేపట్టేందుకు అవసరమైన అవకాశాలు, నైపుణ్యాలను తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.యు.ఎల్.ఎం. డైరెక్టర్ సునీల్ కుమార్ యాదవ్ మహిళలతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. లీప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భవ్య శర్మ, ప్రాజెక్ట్ హెడ్ షీలా శ్రీనివాస్‌లు ప్రాజెక్టులు, దరఖాస్తు చేసుకునే విధానం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పథక సంచాలకులు రాఘవ రెడ్డి, సిఎంఎంలు కృష్ణవేణి, సోమ కుమార్, లతో పాటు మహిళలు పాల్గొన్నారు. స్టార్ పెర్ఫార్మర్లకు సర్టిఫికెట్స్ అందజేశారు.


ఆ శాఖంటేనే హడల్..!

- ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువైన మార్కెటింగ్ శాఖ
- మార్కెటింగ్ అంటేనే ముఖం తిప్పేస్తున్న అధికారులు
- కల్తీ నెయ్యి వ్యవహారంతో బెంబేలు
- ఇంకా తుది తీర్పు ఇవ్వని సిట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:

ఆ శాఖ అంటేనే అధికారులు హడలెత్తిపోతున్నారు. పదోన్నతి ఇస్తామన్నా అక్కడికి వెళ్లేందుకు అధికారులు ముఖం తిప్పేస్తున్నారు. కల్తీనెయ్యి వ్యవహారం దేశాన్ని కుదిపేసిన ఘటన. ఈ వివాదానికి టిటిడి మార్కెటింగ్ ప్రధాన కేంద్రం కావడం, పైగా సిట్ దర్యాప్తు ఇప్పటికీ కొలిక్కి రాకపోవడంతో అధికారులు టిటిడి మార్కెటింగ్ శాఖకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సామీ.. ఆ శాఖే మాకొద్దయ్యా... అంటూ అదికారులు బహిరంగంగా ప్రకటిస్తుండడం గమనార్హం.

తిరుమల శ్రీవారి ఆలయ పర్యవేక్షణ బాధ్యతవహిస్తున్నది టిటిడి సంస్థ. టిటిడి అంటే ఓ స్వయం ప్రతిపత్తిగల పాలన వ్యవస్థ. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించడం వీరి ప్రదాన బాద్యత. శ్రీవారికి, తిరుచానూరు పద్మావతి అమ్మవారికి, టిటిడి అనుబంధ ఆలయాల్లో నైవేద్యాలు సమర్పణ, భక్తులకు ఆహార పంపిణీ వంటివి పర్యవేక్షించాల్సిన బాద్యత మార్కెటింగ్ శాఖదే. టిటిడి బడ్జెట్‌లో అధికబాగం ఆ శాఖదే. టిటిడి ఆద్వర్యంలో సరఫరా చేసే ఆహార పదార్థాలు, ప్రసాదాలు తయారీకి అవసరమయ్యే ముడి సరుకులు కొనుగులు బాద్యత ఆ శాఖదే. ఉప్పు దగ్గర నుంచి ముడి సరుకుల వరకు, పోషక పదార్థాలైన జీడిపప్పు, ఎండుద్రాక్ష, ఏలకులు, కర్జూరం, నెయ్యి, బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలు, ఆకుకూరలు, అన్ని నిత్యవసర సరుకులు కొనుగులు బాద్యత, పర్యవేక్షణ మార్కెటింగ్ శాఖది. ఈ శాఖకు విరాళాల రూపంలో కొన్ని ఆహారపదార్థాలు ఉచితంగానే అందుతుంటాయి. విరాళాలు కాకుండా ఈ శాఖ ద్వారా ఏడాదికి సుమారు 500 కోట్ల రూపాయలు



కొనుగోళ్లు జరుగుతుంటాయి. అలాంటి కీలక శాఖలో అనుబవజ్ఞులైన అధికారుల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఇతర శాఖకు చెందిన అధికారులను ఇన్‌చార్జీలకు మార్కెటింగ్‌కు ఏర్పాటు చేయడం విడ్డూరం. అందులోనూ సివిల్ విభాగానికి చెందిన ఇంజనీర్లను ఈ శాఖకు కేటయించడం శోచనీయం. వాస్తవానికి ఫుడ్‌కార్పొరేషన్, మార్కెటింగ్ వంటి శాఖలకు చెందిన అనుభవజ్ఞులు ఇక్కడ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. కల్తీ నెయ్యి ఘటనతో అధికారులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఇన్‌చార్జిగా వ్యవహర్తిస్తున్న వ్యక్తి ఆరు నెలల క్రితం పదవీ విరమణ చేయడంతో ఆ శాఖకు పూర్తిస్థాయి అధికారులు కరువయ్యారు.

సివిల్ ఇంజనీరింగ్ శాఖలోనే మరో అధికారికి ఆ బాధ్యత అప్పగించగా, పట్టుమని పది రోజులు కూడా ఉండకుండానే తప్పుకున్నారు. ఈఈ స్థాయి అధికారులు అందుకు పెద్దగా ఆశక్తి చూపకపోవడంతో డిప్యూటీ ఈఈ స్థాయి అధికారికి బలవంతంగా ఆ శాఖను కట్టుబెట్టడం గమనార్హం. ఇకనైనా టిటిడి యాజమన్యాం మార్కెటింగ్ శాఖకు అందుకు సంబంధించిన అనుభవజ్ఞులైన అధికారులను నియమించి, అవసరమైతే ప్రభుత్వం నుంచి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి, ఆ శాఖ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి, నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

డిఏ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం రండి...టీ తాగుదాం మాట్లాడుకుందాం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కొత్తూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుగుణమ్మ, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై నేతన్నల హర్షం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ప్రకటిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధి ఆకాశం మునిరాజ, గుబ్బల సుశీల, చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు. చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షించదగిన విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 1472 చేనేత కుటుంబాలు, 884పవర్ లూం కుటుంబాలు, చిత్తూరు జిల్లాలో 1915చేనేత కుటుంబాలు, 948పవర్ లూం కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతారన్నారు. పట్టు సబ్సిడీ పథకాన్ని మరలా తీసుకురావాలని కోరారు. తలారివెట్టుగ్రామనికి చెందిన పవర్ లూం కార్మికులు ఆకాశం మునిరాజా, మాధవి దంపతులు తమ చిన్ననాటి నుండి చేనేత వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఈ వృత్తి ద్వారానే ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపామని, వ్యాపారస్తుల వద్ద చీరలు నేసి కూలీ కోసం పనిచేస్తున్నామన్నారు. కల్లివెట్టు సూరాతి మునస్వామి, నాప చిన్నిక్రిష్ణయ్య, జక్కుల భారతి, జగదీశ్, రఘు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పరచిన "స్కిల్ హబ్"లో ఉచిత కోర్సుల్లో శిక్షణ పొంది, ఉత్తీర్ణులయినవారికి మంగళవారం కళాశాలలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మౌలి ఈ ఉచిత కోర్సులతో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో , వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, మన్యం నరసింహులు, కాలేజీ స్కిల్ హబ్ ఇంచార్జ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మండల శాఖ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీపీ సుబ్బులక్ష్మి, ఎంపీడీవో వెంకటరత్నమ్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన బుచ్చినాయుడుకండ్రిగ మండలం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయా లేదా పర్యవేక్షించాలని సూచించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరి చేసి, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులను అందించారు. వెలుగు కార్యాలయంలో వెలుగు మహిళలకు క్రెడిట్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రాజేశ్వరికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - తడ : తడ మండలం, అండగుండాల పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న తెలుగు భాషా పండితురాలు రాజేశ్వరిని అండగుండాల మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ రఘురామయ్య ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. ఉపాధ్యాయినిగా వారు చేసిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు తెలుగు భాషా అభివృద్ధికి ఆమె చేసిన సేవలు, పలువురు విద్యార్థులకు పోటీలు నిర్వహించి అందరి మన్ననలు ఆమె పొందారని సుధాకర్, దేవేంద్ర ప్రసాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

దాసరి ఇండ్లకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు పంచాయతీ, వేంకటేశ్వర దాసరి ఇండ్లకు ఇంటి పట్టాలు ఇవ్వాలని మంగళవారం పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత గిరిజన జిల్లా కార్యదర్శి సదయ్య గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018 నుండి తడుకు లెక్క దాఖలాలలో సర్వే నంబరు 6/2 లో చెట్టు, పుట్ట కొట్టుకొని గుట్ట చదును చేసుకొని దాసరి కులస్తులు ఇండ్లు వేసుకొని నివసిస్తున్నారని తెలిపారు. ఎన్నోసార్లు అధికారులు చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం ఇంటి స్థలాలు లేనివారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. స్పందించిన తహశీల్దార్ అర్హులైన వారిని పరిశీలించి, ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

బిసిల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: బిసిల అభ్యున్నతే టిడిపి లక్ష్యమని ఆ పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.ఎం.ఉమేష్ రావు కొనియాడారు. గీత కులాల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా మద్యం షాపుల్లో రిజర్వేషన్ ఇవ్వడమన్న హామీని నిలబెట్టుకుంటూ గ్రామాల్లోని యాత, గౌడ్, ఈడిగ, గౌండ్ల, గామల్ల, కలాలీ, గొండ్ల, శ్రీశయన, శెట్టి, శెట్టిబలిజ కులాలకు మొత్తం 335 మద్యం దుకాణాలను (10 శాతం) చంద్రబాబు కేటాయించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు బార్లలో కూడా 10 శాతం కేటాయించేయడం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. 7వ తేదీ నుండి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం, 15 నుండి మహిళలకు ఉచిత బస్సు కూడా కల్పించనున్నారని తెలిపారు.

ఆశ కార్యకర్తల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆశ కార్యకర్తల సేవలు అభినందనీయమని పుత్తూరు రూరల్ మండలం, పరమేశ్వర మంగళం ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ హేమ భూషణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆశ డే సందర్భంగా వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. వేపగుంట పంచాయతీలో పనిచేస్తున్న ఆశ కార్యకర్త కుసుమ్మ పదవీ విరమణ పొందారు, సహోద్యోగులు ఆమెను ఘనంగా సన్మానించి కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్య అధికారి డాక్టర్ సాయి, సూపర్వైజర్ విజయమ్మ, ఉమాదేవి, ఏఎన్ఎంలు, పిహెచ్‌ఓలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఐజర్‌లో స్నాతకోత్సవం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, జంగాలపల్లి, ఐజర్ విశ్వవిద్యాలయంలో 6వ వార్షిక స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా గోదావరి బయోరిఫైనరీస్ లిమిటెడ్ ఛైర్మన్, సోమయ్య విద్యా విహార్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సమీర్ సోమయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేశారు. కార్యక్రమానికి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ ప్రొఫెసర్ రుబ్బల సింగ్ యాదవ్ అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ఫణి ముఖ్య పాత్ర పోషించారు. సంస్థ డైరెక్టర్ ప్రొ. శాంతను భట్టాచార్య మాట్లాడుతూ, పరిశోధన, వైజ్ఞానిక అభివృద్ధులకు పునాది వేసే విధంగా ఐజర్ తిరుపతిని నిర్మించామని తెలిపారు. అనంతరం 2024–25 సంవత్సరంలో 22 పిహెచ్‌డీలు, 8 ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలు, 3 ఎంఎస్, 141 బీఎస్–ఎంఎస్ డ్యూయల్ డిగ్రీలు, 69 ప్రొఫెషనల్ మాస్టర్స్ డిగ్రీలు, 6 బీఎస్, 6 బీఎస్సీ డిగ్రీలు ఐజర్ విశ్వవిద్యాలయం అందించడం జరిగింది.

చవితి ఏర్పాట్లు పకడ్బందీగా చేయండి

- నిమజ్జనంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన అతి భారీ విగ్రహాలు నిషేధం
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వినాయక చవితి నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన అతి భారీ విగ్రహాలను నిషేదించాలని, ఉత్సవాలను పకడ్బందీగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న వరసిద్ధి వినాయక ఉత్సావాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, ఎస్పి హర్షవర్ధన్, జెసి శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డి.ఆర్.ఓ నరసింహులు, శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు, అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం రోజుకి గజ ఈతగాళ్లు తగినంతమంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్టి వినాయకుల నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని వుండదని తెలిపారు. బ్లీచింగ్, శానిటేషన్, త్రాగు నీరు, స్టేజి, లైటింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్ పోలీస్ వారితో సమన్వయం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. బాణాసంచ పేల్చరాదని తెలిపారు. ఆర్టీసీ వారు బస్ ట్రాఫిక్ రూట్ సమన్వయం పోలీస్ వారితో చేసుకోవాలని సూచించారు. అంబులెన్స్ ల ఏర్పాటు, ప్రథమ చికిత్స ఏర్పాటు ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. ఏపీఎస్పీడిసిఎల్ వారు పవర్ కట్ లేకుండా చూడాలని, కరెంట్ తీగలు వేలాడుతుంటే వాటిని సరిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఉమ్మడి జిల్లాలోని హైదరాబాదు లాంటి మహా నగరం లో నిర్వహించే విధంగా మన రాష్ట్రంలోనే తిరుపతి లో కూడా అధికారులు, తిరుపతి వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటి సమన్వయంతో ప్రతి ఏట ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో ఫైర్, విద్యుత్, పోలీస్, మునిసిపల్ తదితర అధికారులు ఒకే వేదికలో కూర్చునేలా ఏర్పాటుతో పర్మిషన్లు త్వరితగతిన ఇచ్చేలా ఇవన్నీ విగ్రహాల ఏర్పాటుకు రెండు మూడు రోజులు ముందే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండపాలలో భక్తి పాటలు మాత్రమే ప్లే చేయాల్సి ఉంటుందని, ఇతర పాటలు ఉండరాదని కోరారు. ఎలాంటి గొడవలు పడకుండా అందరూ ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరిగేలా అందరూ సహకరించాలని, త్రాగి గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, శ్రీకాళహస్తి, సూళ్ళురు పేట, గూడూరు ఆర్.డి.ఓ లు భానుప్రకాష్, కిరణ్మయి, రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ రవి మనోహరా చారీ, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, తిరుపతి వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, టి.టి.డి బోర్డు మరియు మహోత్సవ కమిటీ మెంబర్ భానుప్రకాష్ , తిరుపతి వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుక ఏర్పాట్లు పక్కాగా చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:79 వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పక్కాగా ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ గారు జెసి శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, డిఆర్ఓ నరసింహులుతో కలిసి ఈ నెల ఆగస్ట్ 15న నిర్వహించనున్న 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 15న పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని, ఏర్పాట్ల పర్యవేక్షణ తిరుపతి ఆర్డీఓ చేయాలని సూచించారు. బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణ, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, తుడా వారు సమన్వయంతో ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ డిఈఓ చూడాలని, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డిఎంఅండ్ హెచ్ఓ, వివిధ గాలరీల ఏర్పాటు, పారిశుద్ధ్యం, త్రాగునీరు వసతి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా ఎస్.ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, శకటాలను వివిధ శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పలు శాఖలు సాధించిన ప్రగతి నివేదిక తయారీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను సమాచార శాఖ పర్యవేక్షించాలని తెలిపారు.

పేదలకు భూములు పంచాలి : సిపిఎం




ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో జంగాలపల్లి సచివాలయం వద్ద కలపాడు గ్రామ ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ పేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కలపాడు గ్రామపంచాయతీ పరిధి సర్వే నెంబర్ –1లో 1441 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయన్నారు. గ్రామంలో సెంటు భూమిలేని నిరుపేద దళితులు గిరిజనులు సుమారు 300 కుటుంబాలు వారు ఉన్నారన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మేత పరంబోకుగాను, అడవి పరంబోకుగాను నమోదై ఉన్నాయని అన్నారు. సెంట్ భూమి లేని నిరుపేదలకు కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వ సంవత్సరము నుండి సదరు భూమి కోసం దళిత గిరిజనులు వెనుకబడిన తరగతుల వారు పోరాడుతున్నారన్నారు. దళిత గిరిజనులను ఫారెస్ట్ వారు రెవెన్యూ వారు అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన వారు మాత్రం దర్జాగా జెసిబిలు పెట్టి ఆక్రమణ చేసుకుంటున్నా వారి జోలికి ఎవరు వెళ్లడం లేదని లేదన్నారు. ఎక్కడ పేదవాడికి అన్యాయం జరిగితే అక్కడ సిపిఎం పార్టీ ఎదిరించి పోరాడుతుందన్నారు. కలపాడు దళిత గిరిజనులకు రెండు ఎకరాలు చొప్పున భూమిని పంపిణీ చేయాలన్నారు. లేదంటే కలపాడు గ్రామ భూ పోరాట కమిటీ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలపాడు గ్రామ భూ పోరాట కమిటీ నాయకులు చెంచు కృష్ణయ్య దారా కృష్ణయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో చిరుత సంచారం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో మళ్లీ చిరుత పులి సంచరించింది. మంగళవారం స్థానికులు నివాసం వుండే ఈస్ట్ బాలాజీ నగర్ బాల గంగమ్మ ఆలయం వద్ద చితు సంచరిస్తూ సిసి కెమెరాల్లో రికార్డయింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని, వీడియోను పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని వారికి ధైర్యం చెప్పారు.

ప్రకృతి కన్నెర్ర... రైతు బలి





ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షం రావడంతో ఖరీఫ్ సీజన్లో 6 ఎకరాలు వరి నాటిన రైతుకి కన్నీళ్లు మిగిలాయి. ఇంకా 20 రోజులు అయితే పంట చేతికి వచ్చేది. అయితే ప్రకృతి ఒక్కసారిగా కన్నెర చేయడంతో వరి పంట నేల పాలయ్యింది. అసలే ఖరీఫ్ సీజన్లో దిగుబడి అంతంత మాత్రమే.. దీంతో రైతు చేసిన అప్పుకి అధిక వడ్డీలు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత రబీలో అప్పు ఇప్పుడైనా తీర్చుదాం అనుకున్నా : మురళి, రైతు, చిందేపల్లి

గత రబీ సీజన్లో పంట వేసినప్పటికీ మద్దతు ధర లేకపోవడంతో చేసిన అప్పు సగం మిగిలిపోయింది. దీని దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్‌లో 6 ఎకరాలు వరి మే నెలలోనే నాటాను. చివరికి పంట చేతికి వచ్చే సమయంలో సోమవారం కురిసిన గాలివానకి మొత్తం ఆరు ఎకరాలు పంట నేల పాలయ్యింది. అప్పు తీర్చలేక కటుంబం వీధులపాలవుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

'మన మిత్ర' యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రజాశక్తి - నాయుడుపేట:ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన మిత్ర వాట్సాప్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఎస్.కే.ఫజులుల్లా పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం మన మిత్ర వాట్సాప్ యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించేదుకు, పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మన మిత్ర వాట్సాప్ యాప్ విధానం ద్వారా ప్రజలు తమ స్మార్ట్ ఫోన్‌లలోని వాట్సాప్‌ను ఉపయోగించి వివిధ రకాల పౌర సేవలను సులభంగా పొందవచ్చునన్నారు. మన మిత్ర సేవల కోసం ఏపీ ప్రభుత్వం 95523 00009 నంబర్‌ను కేటాయించిందన్నారు. మీ వాట్సాప్ నంబర్ నుండి ఆ నెంబర్‌కు హయ్ అని మెసేజ్ పంపితే కావాల్సిన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ మిత్ర సేవల ద్వారా ట్రేడ్ లైసెన్సుల జారీ, ఆస్తిపన్ను, కుళాయి ఛార్జీలు, వివిధ ధ్రువపత్రాలను పొందే అవకాశం ఉందన్నారు. వాట్సాప్ సేవలతో ప్రజలు ఇకపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. అలాగే ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు పంపించేందుకు ఈ వాట్సాప్ అకౌంట్ నుంచి మెసేజ్‌లు పంపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, మున్సిపల్, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా పి.మురళి ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:సిపిఐ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు, రెండవసారి కార్యదర్శిగా ఎన్నికైన పి.మురళి తెలిపారు. బైరాగి పట్టెడ, సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శివారెడ్డితో కలసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిపిఐ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎక్స్ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి.హరినాథ రెడ్డి, ఎక్స్ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, వి.జయలక్ష్మి, కె.శివారెడ్డి హాజరై విజయవంతమయ్యాయని తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా నూతన సమితి 49 మందితో కార్యవర్గం 15 మంది ఆహ్వానితులుగా ఒక్కరు మహాసభను ఎన్నుకుంది. పి మురళి రెండవసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికకాగా, కార్యవర్గ సభ్యులుగా ఎ.రామానాయుడు, చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, జల్లా విశ్వనాథ్, సిహెచ్ ప్రభాకర్, ఏ.చిన్ని రాజు, జనమాల గురవయ్య, సి.సుధాకర్ రెడ్డి, బి నదియా, పి.బాలకృష్ణ, జి. శశికుమార్, బండి చలపతి, కత్తి రవి, ఎం చంద్రశేఖర్ రెడ్డి ఆహ్వానితులుగా వి. ఉదయ్ కుమార్‌లను సభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్ల జిల్లా యూనియన్ కార్యదర్శి ఆర్.లక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దామలచెరువు పిహెచ్‌సి ఆవరణలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా ఆశా వర్కర్ల జీతాలు పెంచాలన్నారు. ఆశా వర్కర్లచే ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటున్నదని పనికి తగ్గ ప్రతిఫలం ఇవ్వడంలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, రోజా, మంజుల, ప్రమీల, శ్యామల తదితరులు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి : సిపిఎం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శాంతి నగర్, ఒకటో వార్డు సచివాలయం వద్ద మంగళవారం అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సి.పి.ఎం నాయకులు నిరసన తెలియజశారు. ఈ సందర్భంగా సిపిఎమ్ప్ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్లతో విద్యుత్ బిల్లులు భారంగా మారాయని, అదానికి కోట్లు కూడపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆగస్టు 11వ తేదీ ఆదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.పి.యం నాయకులు పామంజి మణి, అడపాల ప్రసాద్, టి.వెంకట రామిరెడ్డి, కెవిపిఎస్ ఎంబేటి చంద్రయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం పుట్టా శంకరయ్య, గండి కోట మధు, బి.చంద్రయ్య, ఏ.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడు కోల్పోయిన గిరిజనులు



ప్రజాశక్తి - పెళ్లకూరు:పెళ్లకూరు మండలం, కానూరు రాజుపాలెం గిరిజన కాలనీలో నాలుగు రోజుల క్రితం పసుపు నాటి శివయ్య, వెంకటమ్మ దంపతులకు చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్ళగా వీరిద్దరూ ఇద్దరు చిన్నపిల్లలతో ఒక పూరి గుడిసె నిర్మించుకుని కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. వంట చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పంటుకొని ఇంటిలో ఉన్న బట్టలు, సామాగ్రి మిగిలిన అన్ని వస్తువులు కాలిపోయాయని తెలియజేశారు, చుట్టుపక్కల వారు చూసి మంటను అదుపు చేశారు. సమాచారం ఎవరికీ ఇవ్వాలో తెలియక స్థానికులు ఇచ్చిన సలహాతో సోమవారం కలెక్టర్ ఆఫీసులో గ్రీవెన్స్‌లో తమ గోడు విన్నవించుకున్నారు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వీరికి న్యాయం చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

లిఫ్ట్ గొలుసు తెగి కార్మికుడు మృతి



మృతి చెందిన ఎస్.జహీర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : లిఫ్ట్ పని చేస్తూ ప్రమాదవశాత్తు గొలుసు తెగడంతో కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అనంతపురం జిల్లాకు చెందిన ఎస్.జహీర్ (35) తిరుపతిలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళం రోడ్డు మేడిగో హాస్పిటల్ వీధిలో లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం పనులు చేస్తున్నాడు. లిఫ్ట్ గొలుసు తెగి దారం మెడకు చుట్టుకొని, ఐదు అంతస్తుల నుండి బయటకు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యజమాని జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే కార్మికుడు మృతి

తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, తిరుపతి నగర్ కార్యదర్శి టి.దాసు, శ్రీరాములు, నారాయణస్వామి ప్రమాదానికి కారణమైన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన యజమాని తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం వారు, భవన యజమాని ఆదుకోవాలని, లేనిపక్షంలో లేబర్ అధికారులకు తెలియజేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

క్రైం న్యూస్

నీటి గుంటలో మృతదేహం

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండలం, కల్లూరు, కొత్తపాలెం శివాలయం పక్కనున్న నీటి గుంటలో మృతదేహం కలకలం రేపింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా వాకాడు ఎస్సై నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతడు బల్లి చంద్రబాబు(42)గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత మూడు రోజులుగా చంద్రబాబు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గుంటలో ఉన్న మృతదేహాన్ని అతని భార్య జ్యోతి గుర్తించి తన భర్త చంద్రబాబు అని తెలిపారు. మృతుని స్వగ్రామం నాయుడుపేట మండలం, వేమ గుంటపాలెం కాగా, తన అక్క కూతురు జ్యోతిని వివాహం చేసుకొని, గత 15 సంవత్సరాలుగా కల్లూరు, కొత్తపాలెంలో నివసిస్తున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహంపై బట్టలు లేకపోవడం, శరీరం బాగా శల్యమవడంతో పలు అనుమానాలకు దారితీస్తుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి



మృతి చెందిన రూపక్ రాయ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, రైల్వే స్టేషన్ ఆర్చి వద్ద యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐ తిరుపతయ్య తెలిపిన వివరాల మేరకు, మృతుడు అస్సాం రాష్ట్రం, కోక్ రాజ్ హర్ జిల్లా డింగ్ డింగ్ గ్రామానికి చెందిన రూపక్ రాయ్ (23) గా గుర్తించామ న్నారు. మృతుడు అనారోగ్యంతో చనిపోయాడరన్నారు. మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులకు చరవాణి ద్వారా సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి



మృతి చెందిన రైతు మునెయ్య

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, నందిమాలకు చెందిన రైతు మునెయ్య (49) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్ శాఖ సిబ్బంది తెగిపడి ఉన్న వైర్లు సరి చేయకపోవడంతో, రైతు షాక్‌కు గురై మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా చిల్లకూరులో ఇదే విధంగా విద్యుత్ షాక్‌కు గురై విద్యార్థి మృతి చెందాడు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా స్పందించకపోవడం గమనార్హం.

ఉచిత అంబులెన్స్ సేవలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్:పేద ప్రజలకు చేయూతనివ్వాలనే ఆశయంతో తుడా ఛైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి మరో ఉచిత సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి రుయా ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందుకోసం సిద్ధం చేసిన నూతన అంబులెన్స్‌ను తుడా ఛైర్మెన్ పరిశీలించారు. రూయ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందిస్తున్నామని, ఈ సేవలను ఆసుపత్రికి వచ్చేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో 3 రోజుల్లో ఉచిత అంబులెన్సు సేవలు అందుబాటులోకి వస్తాయాన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఆఫర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న ఆజాదికా ఆఫర్‌లో కేవలం ఒక్క రూపాయి చెల్లించి సిమ్ కార్డు పొంది, 30 రోజులపాటు ప్రతి రోజు 2 జిబి డేటా, అపరిమిత ఉచిత కాల్స్ పొందవచ్చని టెలికాం జనరల్ మేనేజర్ అమరేంద్ర రెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇతర ఆపరేటర్స్ నుండి పోర్ట్ అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. వినియోగదారులు దగ్గరలో ఉన్న బిఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం లేదా రిటైలర్‌ను సందర్శించి ఈ ఆఫర్ పొందొచ్చని తెలిపారు.

నవీన్ పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సత్యసాయి జిల్లా, తలుపుల మండలం, పులిగుండ్ల పంచాయతీ, రాజనాల గ్రామంలో అక్కడి అగ్రవర్ణాల వారు, బలహీన వర్గాలకు చెందిన వడ్డెర వల్లెపు నవీన్‌పై బంగారు గొలుసు దొంగలించాడని తప్పుడు కేసు పెట్టి, చిత్రహింసలు పెట్టి భయభ్రాంతుడిని చేశారని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ ఆరోపించారు. తిరుపతి, ఒక ప్రైవేటు ఆఫీసులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సై, సిఐలు వాస్తవాలు విచారించకుండా వల్లపు నవీన్‌ను విచక్షణారహితంగా కొట్టినందున, నవీన్ పోలీస్ స్టేషన్లోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వ్యతిరేక వర్గానికి అనుకూలంగా పనిచేశాడని ఈ కక్షసాధింపు చేశారని విమర్శించారు. అగ్రవర్ణాల వారిపై 306, 302 సెక్షన్లు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, నవీన్ కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు చల్లా వెంకటయ్య మాట్లాడుతూ వడ్డెరకు కూడా, ఎస్సీ ఎస్టీలకు ఉన్న విధంగా రక్షణ చట్టాన్ని చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెరిపిటి మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే తగు రక్షణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర వృత్తిదారులు ఉద్యమం చేవడతావని హెచ్చరించారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, మినీ గురుకులంలో మంగళవారం విద్యార్థినులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామ్మోహన్ రావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రోహిణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్య శ్రీ, దంత వైద్య నిపుణులు డాక్టర్ నారాయణ, గైనకాలజీ డాక్టర్ కీర్తి నారా, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ త్రివిక్రమ్ రావు పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సుళ్లూరుపేట మండల పరిధి, మంగళంపాడు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలపై వేధింపులు, మహిళల భద్రత, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరికోట ఎస్సై, లేడీ కానిస్టేబుల్స్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతిలో, మంగళం రూరల్స్ సెక్షన్‌లో మునిసిపల్ కార్పొరేషన్ అండర్ డ్రైనేజీకి సంబంధించి విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపిఎస్పీడిసీఎల్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పిడి. నగర్ తదితర పరిసర ప్రాంతాల విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని వినియోగ దారులు సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజావీదిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆద్వర్యంలో ఇన్నర్ వీల్ అండ్ ఆంద్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణమ్మ విచ్చేశారు. కార్యక్రమ దాతగా విజయ 5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు మాధురి, కార్యదర్శి లక్ష్మీ, స్నేహలత, పవిత్ర, రెడ్ సంస్థ సభ్యులు పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.

క్రీడల్లో సరస్వతి శిశు మందిరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యా భారతి–ఆంధ్ర ప్రదేశ్ సంస్థలో కడప విభాగస్థాయి ఆటల పోటీల్లో కడప జిల్లా ఆర్.టి.పి.పి లో జరిగిన ఆటల పోటీలలో గూడూరు శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాల విద్యార్థులు (బాలురు, బాలికలు) పాల్గొని అథ్లెటిక్స్ లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొంది 17 బహుమతులను సాధించారు. ఖోఖోలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల కార్యదర్శి బండి శ్యాంసుందర్, పాఠశాల సహకార కార్యదర్శి అశోక్ కుమార్, పాఠశాల సలహా సమితి సభ్యులు వాకాటి రామ్మోహన్, ప్రధానాచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లా డిపార్ట్మెంట్ లీగల్ సపోర్ట్ సెల్‌లో వినియోగదారుల రక్షణ చట్టం గురించి మంగళవారం చంద్రగిరి మండలం జిల్లా ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది రామచంద్రుడు, మల్లీశ్వరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సోసియల్ వర్క్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ కె. అనురాధ, లా డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ డా. సీతా కుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. మాధురి పరదేశి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సునీత కాణిపాకం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఇందిరా ప్రియదర్శిని, విద్యార్థినులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

ప్రజాశక్తి-ఏర్పేడు: పాపా నాయుడు పేట లో జరిగే ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఆలయ చేనేత సంఘం సభ్యులు తిరుపతి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్ప మొదలి, రవి కుమార్, అర్జున్ బాబు, రోశయ్య, మొహన్ రెడ్డి పాల్గున్నారు.

అశ్వ వాహనంపై ద్రౌపది మాత

శ్రీ ద్రౌపది దేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం పల్లకి సేవ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు.

ఎస్‌పిడబ్ల్యూ కళాశాలను సందర్శించిన భాను ప్రకాష్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలను టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి సందర్శించి ప్రిన్సిపల్ డా. సి.భువనేశ్వరితో కలిసి తరగతులకు వెళ్లి విద్యార్థినిలతో, అధ్యాపకులతో చర్చించి వారిలో నూతనోత్తేజాన్ని నింపి, రాష్ట్రంలోనే ఎక్కువ డిమాండ్ ఉన్న కళాశాలగా శ్రీ పద్మావతి మహిళా కళాశాల పేరు పొందిందని, ఇటువంటి కళాశాలలో సీటు రావడం మీ అదృష్టమని, శ్రీవారి సన్నిధిలో ఉన్న మీరు టిటిడి కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని కళాశాలకు,టీటీడీ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినిలు అడిగిన మరికొన్ని సదుపాయాల కొరకు టిటిడి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ముఖ్యంగా వసతి గృహంలో మెరుగైన వైద్య సదుపాయాన్ని కూడా కల్పించడం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కళాశాల పురోగతి గురించి ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకుని మరిన్ని అవసరమైన నూతన భవనాల కోసం, కోర్సుల కొరకు యాజమాన్య దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం విద్యార్థినిల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి సుదూర ప్రాంతాల నుంచి ఎందుకు ఇక్కడికి విచ్చేస్తున్నారన్న విషయాన్ని వారిని అడగగా తల్లిదండ్రులు మాట్లాడుతూ మంచి నాణ్యమైన విద్య మరియు చక్కటి వాతావరణం భద్రత, కళాశాల నిర్వహణ తీరు నచ్చిందని వారు తెలిపారు. టిటిడి కార్య నిర్వహణాధికారితో మాట్లాడి హాస్టల్ వసతి సీట్ల పెంపుకు కృషి చేస్తానని తల్లి దండ్రులతో చెప్పారు.

ముగిసిన రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మూడు రోజుల పాటు జరిగిన రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవాలు మంగళవారం పురుషుల యువజన సమ్మేళనంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆధ్యాత్మికత మనసులోని అంతరాలకు తీసుకుని వెళ తుందన్నారు. భారతీయ సంస్కృతి సనాతనమైనదని, అందరూ కలసి జీవించాలని చెబుతుందని గుర్తు చేశారు. ప్రకృతిని కాపాడుకుంటూ, జంతువులను ప్రేమించాలన్నారు. జంతువులు దేవుళ్ళ వాహనాలని తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతల గురించి రామకృష్ణ మిషన్ అనేక పుస్తకాలు ప్రచురించాయన్నారు. ధ్యానం చేసి మనస్సును జయించ వచ్చని తెలిపారు. తిరుపతి రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానందజీ మాట్లాడుతూ ఆశ్రమ కార్యక్రమాలు దేశ వ్యాప్తంగానే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్‌లలోనూ జరుగుతుంటాయని చెప్పారు. 1893లో చికాగో సమావేశంలో వివేకానంద మాట్లాడుతూ అక్కడి వారిని ఉద్దేశించి 'సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా' అనడంతో అక్కడి సభ కరతాల ధ్వనులతో మారు మోగిందన్నారు. భారత దేశం ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలి పోయిందని, దీనికి కారణం సమైక్యత లేక పోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ, విజయవాడ ఆశ్రమ సహాయ కార్యదర్శి స్వామి శితికంఠనందజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మంలోనే మానవ జీవన శైలి ఉంది



ప్రజాశక్తి - క్యాంపస్ : భారతీయ సనాతన ధర్మంలోనే మానవ జీవనం, శైలి దాగి ఉందని ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మూడు రోజుల భాష్యోత్సవ జాతీయ సదస్సులో, అక్షర పురుషోత్తమ మందిర ఆవిష్కరణలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం లోని హెరిటేజ్ కారిడార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీస్వామినారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని ముఖ్యాతిథులు ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి విశ్వవిద్యాలయం వైస్–చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తితో, బాప్స్ ముఖ్యాధ్యక్షులు పూజ్యశ్రీ సాధు భద్రేశదాస్ స్వామివారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం విసి ప్రొ.రాణీ సదాశివమూర్తి, సభాసంచాలకులు శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ ప్రొ.కె.గణపతిభట్ తదితరులు పాల్గొన్నారు.

రామారావుని బదిలీ చేయాలి



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:వెంకటగిరి మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణ పురవీధులలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ అవినీతి అక్రమాల శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రేపటినుండి సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ ర్యాలీలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ వల్లూరు పెంచలయ్య, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెంచు కృష్ణయ్య, చెంచురామయ్య, గొర్ల పెంచలయ్య, ఆటో కార్మికులు, వీధి విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని రోటరీ క్లబ్ అధ్యక్షులు పార్థసారథి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలోని బాలింతలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ మణి, రోటరీ క్లబ్ సభ్యులు కండ్రిగ ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు పంచాయితీలో మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ దేవకుమార్ తల్లి పాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుదర్శనం, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పిచ్చాటూరు: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రు పాలు తాగిస్తే ఆరోగ్యకరమని సిడిపిఓ సౌభాగ్యమ్మ మంగళవారం స్థానిక పిచ్చాటూరు గాంధీ నగర్ అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు భారతి, కోమల, సఫియా, అముదా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో వినుకొండ హరి, హరిప్రియల కుమారుడు వినుకొండ మాయన్ దేవ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్లూ పార్క్ హేచరీస్ అధినేత వినుకొండ హరి, హరిప్రియ వృద్ధులకు భోజన వసతిని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ ట్రెజరరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు మెడనూరు సురేష్ రెడ్డి, పయ్యావుల మురళి నాయుడు, కె ఆర్ ఎం, పిల్లేల శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు కృష్ణారెడ్డి, ఎగిరెడ్డి విజయ్, కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిచే ప్రార్థనా వేదిక నిర్మాణం

ప్రజాశక్తి-ఏర్పేడు: సంపద పెరిగితే వెళ్లాల్సింది గుడి కాదు బడికి అని నిరూపించాడు పల్లం పాఠశాల పూర్వ విద్యార్థి బాపన శివశంకర్. పల్లం పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన చింతలపాలెం నివాసి బాపన శివశంకర్ జీవితంలో ఉన్నతంగా ఎదిగి తన చదువుకున్న పాఠశాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రార్థనా వేదిక నిర్మాణానికి సహకారం అందించారని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తెలియజేశారు. శివకుమార్ గతంలో కూడా పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌ను బహుకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:8వ తేది వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక క్యూ లైన్లు, అన్నప్రసాదం, తాగునీటి సరఫరా, విద్యుద్దీపాల, పుష్పాలంకరణ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించబడుతుంది. మహిళా భక్తులకు 'సౌభాగ్యం' ద్వారా అమ్మవారి అనుగ్రహం అందేలా చర్యలు చేపట్టారు.

శ్రీ ద్రౌపది దేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో జరుగుతున్న శ్రీ ద్రౌపది దేవి సమేత శ్రీ ధర్మరాజుల వారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీ వారిచే ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పట్టు వస్త్రాల సారె సమ ర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రోజా బజార్ వీధిలోని పిల్లయార్ వినాయక గుడి వీధి దగ్గర నుండి ఊరేగింపుగా శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజులు బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.